## క్లుప్తంగా

### రేపటి నుంచి ఆరాధన ఉత్సవాలు


నేల మఠంలో కొలువుదీరిన వీరబ్రహ్మేంద్ర స్వామి

బనగానపల్లె : బనగానపల్లె సమీపంలోని వీరప్పయ్యస్వామి నేలమఠంలో ఈ నెల 17 నుంచి 19వరకు 331వ ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.17న ఉదయం 5 గంటలకు నాగస్వరం, సుప్రభాతం, పంచామృతాభిషేక అష్టోత్తర శాతనామ పూజలు, మాత వీరకాళికాంభదేవికి కుంకుమార్చన, 10 గంటలకు గరిమిరెడ్డి అచ్చమాంబ ఇంటి నుంచి స్వామివారి 331వ సంవత్సరపు జీవా సమాది జ్ఞాపిక పతాకం తీసుకొస్తారు. మధ్యా హ్నాం 12 గంటలకు మహా ప్రసాద వితరణ, సా యంత్రం 7 గంటలకు పల్లకీ సేవా నిర్వహిస్తారు. 18న స్వామివారికి పంచామృతాభిషేక అష్టోత్తర శాతనామ పూజలు, వీరకాళికాంభదేవి అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 7 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, 19న మహానివేధన తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ వివరించారు.

### విద్యుత్ స్తంభాల ఏర్పాటు


ఆల్వకొండలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు వివిధ గ్రామాలలో నాలుగురోజుల క్రింతం కురిసిన గాలివానకు దాదాపు 200 స్తంభాలు గాలికి నేలకొరిగాయి. వాటి స్థానంలో సిబ్బంది కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఆల్వకొండ, రెడ్డిపల్లె గ్రామాలలో కొత్త స్తంభాలు ఏర్పాటటు చేశామని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు.

### ఉపాధి కూలీల గరిష్ట వేతనం రూ. 300

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కూలీలకు గరిష్టవేతనం రూ. 300 అందజేస్తున్నట్లు ఏపీఓ ప్రకాష్‌రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు గరిష్టవేతనం రూ. 272 ఇవ్వగా 2024–25లో రూ. 300 ప్రకారం ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వేసవి కావడంతో గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### నివాళి

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నేత నక్కిరామన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నక్కిరామన్న సేవలను సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య గుర్తు చేశారు.

### అనాథ వృద్ధుడు మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం సర్కిల్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు స్టాప్ వద్ద గుర్తు తెలియని అనాథ వృద్ధుడు బుధవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు ఆ వృద్ధుడి వయసు దాదాపు 70 ఏళ్ల ఉంటాయి. కొద్దిరోజుల నుంచి ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ రాత్రి బస్సు స్టాప్‌లో ఉండేవాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి వివరాలు లేకపోవడంతో గుర్తు తెలియని వృద్ధుడి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

### చేపల చెరువు బిల్డింగ్‌లో చోరీ


చోరీ జరిగిన తీరును వివరిస్తున్న సభ్యులు

డోన్ రూరల్ : మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లిపల్లె చెరువు సంబంధించి హరిజన మత్స్యకార సొసైటీ ఉంది. ఈచెరువులో చేపలు నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం బిల్డింగ్ నిర్మించింది. అయితే ఈ బిల్డింగ్‌లో దొంగతనం జరిగిన విషయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పదిరోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు సొసైటీ సభ్యులు బుధవారం తెలిపారు. బిల్డింగ్‌లో ఉన్న 12ఫ్యాన్లు, 12ట్యూబ్ లైట్లు, 30వేల రూపాయల విలువ ఫ్రిడ్జ్, ఇనుప గేట్ దొంగలించారన్నారు. ఈ మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దొంగతనం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని సొసైటీ ప్రెసిడెంట్ చెప్పుల చిన్న రాముడు, వైస్ ప్రెసిడెంట్ శంకర్, సభ్యులు గట్టుసుంకన్న, నాగేంద్ర, వెంకటరాముడు, సుంకన్న, మద్దిలేటి, నడిపి సుంకన్న, బజారి కోరారు.

# వేసవి దుక్కులు లాభదాయకం

- కలుపు యాజమాన్యం వేసవి నుంచే చేపట్టాలి
- కలుపు నివారణ పద్ధతులు అవలంభించాలి
- 21వేల హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు లక్ష్యం

కోవెలకుంట్ల: ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలసాగులో కలుపు సమస్య దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కలుపు యాజమాన్య ప్రక్రియ వేసవి నుంచి చేపడితే మంచి ఫలితాలు వస్తాయి. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 21 వేల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో వరి, పత్తి, మిరప, కంది, మినుము, పెసర, వేరుశనగ, ఉల్లి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. మారిన వ్యవసాయ పద్ధతులతో వివిధ పంటల్లో కలుపు నివారించేందుకు రైతులు వివిధ రకాల కలుపు మందులపై ఆధార పడుతున్నారు. విత్తనం వేశాక, పైరు పెరిగే దశలో మందుల వాడకంతో కలుపు నివారణ చేపడుతున్నారు. కలుపు మందులపై ఆధారపడే ముందు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. ఆ పద్ధతులను ఆచరించి అవసరం మేరకు కలుపు మందులు వినియోగించవచ్చన్నారు. ప్రత్యామ్నాయ కలుపు యాజమాన్య పద్ధతులు కొన్ని వేసవికాలంలోనే చేపట్టాల్సి ఉందన్నారు.

**చదునుగా లేని పొలాల్లో కలుపు సమస్య అధికం**

నేల చదునుగా లేని పొలాల్లో పంటలు సాగు చేసినప్పుడు కలుపు సమస్య అధికంగా ఉంటుంది. వేసవికాలంలో పనులు తక్కువగా ఉన్నందున నేలను చదును చేసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కువ అశ్వసామర్థ్యం ట్రాక్టర్‌తో నడిచే లేజర్ లెవెలర్ నేల చదునుకు అనుకూలం. వీటిని ఉపయోగించి ప్రతి సంవత్సరం లేదా రెండు సంవత్సరాలకు ఓసారి నేలను చదును చేసుకుంటే కలుపు సమస్య తగ్గడమేకాకుండా పంటసాగుకు అనుకూలంగా ఉంటుంది. లోతు దుక్కులు, నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలను ఉపయోగించుకుని నేలను అవసరాన్ని బట్టి 3–4 సార్లు దున్నినప్పుడు నేల పైపొరలలోని కలుపు విత్తనాలు చాలావరకు మొలక దశలోనే అంతరిస్తాయి. పంటతోపాటు వచ్చే కలుపు మొక్కలు చాలా వరకు తగ్గిపోతాయి. ఆరుతడి పంటగా వరి సాగుచేసినప్పుడు, పత్తి, మిరప, తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతుదుక్కులు దున్నుకోవాలి. అధిక ఆదాయ పంటలైన పూలతోటలు, కూరగాయలు, పండ్ల తోటలు, మిరప సాగు చేసే నేలలో వేసవిలో నేలను పాలిథీన్‌షీటుతో కప్పి ఉంచితే నేలపై పొరలలో ఉష్ణోగ్రతలు పెరిగి కలుపు విత్తనాలు మొలక సామర్థ్యం కోల్పోయి కలుపు సమస్య చాలా వరకు తగ్గిపోతుంది.

**ఇతర కలుపుమొక్కల నివారణ**

పొలంలో మొండిజాతి కలుపే కాకుండా ఇతర కలుపుజాతులైన ఊద, చిప్పెర, ఉత్రంకి, గలిజేరు, నేల ఉసిరి, పొన్నగంటికూర వంటి కలుపుమొక్కలు ఉన్నప్పుడు 8–9 అంగులాలపైబడి లోతుదుక్కి దున్నితే నశిస్తాయి. వీటితోపాటు మొండిజాతిక లుపు కూడా కొంత వరకు నివారించబడుతుంది. అంతేకాకుండా నేలలో ఉండే కలుపు విత్తనాలు కొంతవరకు, మొలక దశలో ఉన్న కలుపు మొక్కలు నశిస్తాయి. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పంట కోసిన వెంటనే లేక మేలో వేసవి జల్లులు పడినప్పుడు తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్నుకుని కలుపు సమస్యను నివారించవచ్చు. సాగులో ఉన్న పొలాల్లోనే కాక పొలంగట్లు, పొలానికి వెళ్లే డొంకలు, పొలం పక్కన ఖాళీ ప్రదేశాలు, కాలవు, చెరువుగట్లపై పెరిగే కలుపు మొక్కలపై దృష్టి సారించాలి. పెరాక్వాట్, గ్లెసైల్ వంటి కలుపు మందులను సిఫారసు మేరకు వినియోగించి పెరిగే కలుపు మొక్కలను నివారించడంతోపాటు కలుపుమొక్కల విత్తనోత్పత్తిని అరికట్టవచ్చు.


కోవెలకుంట్ల సమీపంలో లోతు దుక్కి దున్నిన పొలం

**వేసవిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు**

పొలాల్లో పంట కోతల అనంతరం మిగిలిపోయిన కలుపు మొక్కలు పూర్తిగా నాశనం చేయాలి. శనగ, మిరప, మినుము, పెసర పంటల్లో కోసిన తర్వాత మిగిలిన లింగమిరియాల కలుపు కాలపరిమితి ఎక్కువగా ఉండి స్వల్ప, మధ్యకాలిక పంటలు కోసిన తర్వాత పొలంలో మిగిలిపోయి తొలకరి వర్షాల వరకు ఉండి అధిక విత్తనోత్పత్తి చేసుకుంటాయి. కాబట్టి పంట కోసిన తర్వాత పొలంలో మిగిలిపోయిన లింగమిరియాలు, ఇతర కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలి. ఇలా చేయలేని పరిస్థితుల్లో లీటరు నీటికి 2 గ్రాముల ఫెర్నాక్సోన్ లేదా 2 ఎంఎల్ వీడ్‌మార్ సూపర్‌ను కలిపి పిచికారీ చేపడితే పొలంలో మిగిలిపోయిన లింగమిరియాల కలుపును నివారించవచ్చు. ఈ కలుపుతోపాటు ఇతర కలుపు మొక్కలు ఉన్నప్పుడు లీటరు నీటికి 5 ఎంఎల్ పారాక్వాట్ లేదా 10 ఎంఎల్ గ్లెసైల్ తోపాటు పది గ్రాముల యూరియా లేక 4 గ్రాముల ఎక్సెల్ మీరా కలిపి పిచికారీ చేయాలి. పొలంలో మొండి జాతులైన తుంగ, గరిక నివారణకు లీటరు నీటికి 10 ఎంఎల్ గ్లెసైల్‌తోపాటు పది గ్రాముల యూరియా లేక 4 గ్రాముల ఎక్సెల్ మీరా కలిపి పిచికారీ చేయాలి. కలుపు బాగా పెరుగుతున్న దశలో సంబంధిత మందులు పిచికారీ చేపడితే మంచి ఫలితం ఉంటుంది. మినుము, పెసర సాగు చేసిన పొలంలో పంట కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన పరాన్నజీవి అయిన బంగారు తీగ కలుపు నివారణకు పారాక్వాట్ లేదా గ్లెసైల్ పిచికారీ చేసి నివారించవచ్చు.

### వేసవి దుక్కుల్లో రైతన్న


వేసవి దుక్కులు చేస్తున్న రైతు

ప్యాపిలి: ఏదిఏమైనా సాగుకు అన్నదాత చమటోడ్చాల్సిందే. పెట్టుబడులు తగ్గించుకోగలిగితేనే నాలుగు కాసులు మిగిలే పరిస్థితి. ఆ దిశగా వ్యవసాయాధికారులు చేసిన సూచనలు ఇప్పుడిప్పుడే ఫలిస్తున్నాయి. రైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలో 21 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. ఖరీఫ్ సమీపించిన నేపథ్యంలో రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి అడపా దడపా వర్షాలు కురుస్తున్నందున వేసవి దుక్కులు చేసుకుంటూ కర్షకులు బిజీ అయ్యారు. వేసవి దుక్కులు చేయడం ద్వారా కలుపు నివారణతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వేసవి దుక్కులు చేసుకునేందుకు ఇదే అనువైన సమయం అని చెబుతున్నారు. వేసవి దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువులు, ఆవుల మందలను తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడి భూసారం పెరుగుతుంది. పొలంలో ఉన్న ఎండు ఆకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా లోదుక్కులు చేయడం ద్వారా అవి నేలలో కలసిపోయి ఎరువుగా మారుతాయి. వేసవిలో లోదుక్కుల వల్ల నిద్రావస్థలోఉన్న చీడ పురుగు కోశాలు, గుడ్లు, లార్వాలు బయటపడతాయి. శిలీంద్రాలు, గుడ్లు, లార్వాలు అధిక ఉష్ణోగ్రత వల్ల నశిస్తాయి..మరి కొన్నింటిని పక్షులు తిని నాశనం చేస్తాయి. ఈ నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు చేపడుతున్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయికృష్ణ

కొలిమిగుండ్ల: వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వివిధ శాఖల అధికారులతో చర్చించడం, పనులపై తీర్మానాలు చేయలేదు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు మాత్రమే సభ దృష్టికి తీసుకొచ్చారు. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ఇప్పటికే ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నామని, అదనంగా ట్యాంకర్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌లు కోరారు. నాగిశెట్టిపల్లెలో సీసీ రోడ్డుపై మురుగునీరు నిల్వ అవుతుందని, రాక పోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఈశ్వరయ్య అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కనకాద్రిపల్లెలో అవుకు రిజర్వాయర్ స్కీంకు సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వాలని సర్పంచ్ సభలో ప్రస్తావించారు. వర్షాకాలంలోగా గ్రామాల్లో మురిగు కాల్వలు శుభ్రం చేయించాలని ఎంపీడీఓ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.

## మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి


మహానందిలోని రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమితానందం పొందుతూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగగా రాత్రి ఏకాంతసేవ పూజల వరకు భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు.

**మహానందీశ్వరుడి సన్నిధిలో..**

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి నంద్యాల జిల్లా అగ్నిమాపకాధికారి యోగేశ్వర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలంకార మండపంలో వారికి స్వామి ,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

**సాక్షిగణపతికి విశేష పూజలు**

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న సాక్షి గణపతికి బుధవారం సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. జలాభిషేకం, పంచామృతాభిషేకం, షోడషోపచార పూజలతో అభిషేకించి ఉండ్రాళ్లను, రవ్వ లడ్లను నైవేద్యంగా సమర్పించారు.

## చెరువునీరు వృథా!

డోన్ టౌన్ : మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న తుమ్మల చెరువు నుంచి నీరు వృథాగా పోతుంది. దీంతో ఆ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువుకు ప్రధాన నీటి వనరు గతంలో వర్షాధారం కాగా ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు హంద్రీ నీవా కాలువ నుంచి నీటిని మళ్లించి చెరువు నింపే కార్యక్రమం చేపట్టారు. చెరువు పూర్తి సామర్థ్యం 25 అడుగులు కాగా ప్రస్తుతం 11 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. అయితే కొంత మంది అక్రమార్కులు చెరువు తూములకు ఉన్న లాక్‌లను అన్ లాక్ చేస్తూ నీటిని బయటకు వృథాగా పోయ్యేటట్లు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువుకు సంబంధించి నీటి పారుదల శాఖ విభాగం తరుపున లష్కర్ లేక పోవడంతో అక్రమార్కులు తూముల లాక్‌లను తొలగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ, ఇరిగేషన అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని వెంకటాపురం గ్రామస్తులు కోరుతున్నారు.


తూము నుంచి వృథాగా పోతున్న నీరు

### ఉపాధి పనుల్లో ముందున్న మహిళా కూలీలు


ఆర్‌ఎస్ రంగాపురంలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

బేతంచెర్ల: ఉపాధి హామీ పనుల్లోనూ మహిళలు ముందున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. పురుషులకు మేము తీసిపోం అన్నట్లుగా కొండలు, కోనలు, చెక్ డ్యామ్‌లు, కుంటల పూడికతీత పనుల్లోనూ పోటీ పడుతున్నారు. మండలంలో 11,200 జాబుకార్డులు, 8,500 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. అయితే ప్రతి రోజూ 4000 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటుండగా సుమారు 3వేల మంది వరకు మహిళలే ఉండడం విశేషం.

### గుంత ఉంది... జాగ్రత్త!


రోడ్డు పక్కన ఉన్న గుంతలు

డోన్ టౌన్ : పట్టణంలోని నంద్యాల రాల్వే గేట్ల నుంచి బేతంచెర్లకు వెళ్లే రోడ్డులో ఉన్న మసీదు సమీపంలో బాలుర వసతి గృహం రోడ్డు పక్కన ఉన్న మురికి నీటి కాలువకు పెద్దగుంత ఏర్పడింది. తారు రోడ్డు కలిసిపోయేలా గోతి ఏర్పడినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయి. ఎవరైనా అటువెళ్తుంటే గుంత ఉంది... జాగ్రతఅంటూ అప్రమత్తం చేస్తున్నారు స్థానికులు.

### టీడీపీ నాయకుడు కోట్ల అనుచరుడిపై కేసు నమోదు

డోన్ టౌన్ : సోషల్ మీడియా వేదికగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తూ పోస్టు పెట్టిన కోట్ల అనుచరుడు లద్దగిరికి చెందిన ముల్లా మిన్నల్లా హుసేన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. నెల క్రితం వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగ్‌లు పెట్టడం, అదే విధంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్ ముగిసిన తరువాత ఎంపీపీపై టార్గెట్ చేస్తూ అసభ్య పదజాలంతో బెదిరింపులకు పాల్పడుతూ పెట్టిన పోస్టింగ్‌లపై ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కోట్ల ప్రకాష్‌రెడ్డి అనుచరుడు లద్దగిరి ముల్లా మిన్నల్ల హుసేన్‌పై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఓటరు చైతన్యం భేష్!

- బనగానపల్లె నియోజవర్గంలో 84.54 శాతం పోలింగ్
- ఇంకా 37,340 మంది ఓటుకు దూరం


మీరాపురం పోలింగ్ కేంద్రానికి ట్రై సైకిల్ పై వచ్చిన దివ్యాంగుడు (ఫైల్)


గుండ్లశింగవరం పోలింగ్ కేంద్రాని నడువలేని వృద్ధుడిని తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికలు చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు పోటెత్తారు. గతంతో పోలిస్తే పోలింగ్ శాతం మెరుగు పడింది. వర్షం వచ్చినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓపిగ్గా నిరీక్షించారు. పోలింగ్ సమయం అయిపోయినా రాత్రి వరకు ఉండి మరీ ఓటేశారు. నంద్యాల జిల్లాలో నందికోట్కూరు నియోజకర్గంలో 84.79 శాతం పోలింగ్ జరిగి మొదటి స్థానంలో ఉండగా 84.52 శాతం పోలింగ్ నమోదుతో రెండవ స్థానంలో ఉంది బనగానపల్లె నియోజకవర్గం. ఈ గణాంకాల మేరకు ఓటరులో చైతన్యం భేష్. అయితే పోలింగ్ శాతం పెరిగినా బనగానపల్లె నియోజకర్గంలో 37,340 మంది ఓటర్లు ఓటుకు దూరంగా ఉన్నారు. వీరంతా ఓటుకు దూరం ఎందుకున్నారనే విషయాన్ని అటుంచుతే వచ్చే సమాధానం నిర్లక్ష్యమే. వృద్ధులు, మహిళలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పండుటాకులే కాదు దివ్యాంగులు సైతం ఎంతో హుందాగా ఓటు హక్కును వినియోగించుకుంటే... ఈ 37,340 మంది ఓటర్లు ఎందుకింత నిర్లక్ష్యం చేశారనేది అర్థమవ్వని ప్రశ్న. ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఓటు హక్కు వినియోగంపై పెద్దఎత్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మహిళలు, వృద్ధులు బారులు తీరారు. అయితే వీరితో సమానంగా మధ్య వయసు పురుషులతోపాటు యువతులు, కొంతమేర యువకులు రాలేదన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు.

## ఐసీడీఎస్ చెంతకు నవ జాత శిశువు


పోలీసు స్టేషన్‌లో నవ జాతి శిశువును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

డోన్ టౌన్ : ఎట్టకేలకు నవజాత శిశువును ఐసీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 13న ప్రచురితమైన రైలు పట్టాల ప్రక్కన నవ జాత శిశువు అనే శీర్షికకు ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈ నెల 12న మాతృ దినోత్సవం రోజు ఓ తల్లి తన బిడ్డను కర్నూలు రైల్వే గేట్ల వద్ద వదలి వెళ్లడంతో సాక్షి దిన పత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. స్పందించిన ఐసీడీఎస్ పీడీ శంశాద్‌బేగం, సూపర్‌వైజర్లు పరమేశ్వరి, పద్మావతి బుధవారం నవ జాత శిశువును చేర దీసి అక్కున చేర్చుకున్న వెంకటాపురం గ్రామానికి చెందిన రామాంజినేయులు, లక్ష్మీదేవి దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భాస్కర్ సమక్షంలో నవ జాత శిశువును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కర్నూలులోని చైల్డ్ వెల్ఫేర్ కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏస్తేరు రాణి, జులేఖ పాల్గొన్నారు.

**దత్తత ఇవ్వండి**

నవ జాత శిశువును మొదట అక్కున చేర్చుకున్న రామాంజినేయులు, లక్ష్మీదేవి దంపతులు తమకే దత్తత ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులను కోరారు. దేవుడిచ్చిన బిడ్డాగా బాధ్యతగా చూసుకుంటామని వేడుకోగా నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యతనిస్తామని పీడీ తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం


సమావేశంలో మాట్లాడుతున్న కర్రా దంపతులు

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపు తథ్యమని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్లలోని స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితంగా 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో మహిళా ఓటర్లు చైతన్యం చూపారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అబద్ధపు హామీలను ఓటర్లు నమ్మకుండా వైఎస్ జగన్ పక్షాన నిలిచి సంక్షేమానికి జై కొట్టారన్నారు. పోలింగ్ రోజున ఆయా గ్రామాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావడం వైఎస్సార్‌సీపీ విజయానికి నాంది అన్నారు. మహిళలు, వృద్ధులు, యువత వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికారన్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. మరోమారు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారని పేర్కొన్నారు.